ధరల మంట..వంటకు తంటా!

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- పెరగని మెనూ చార్జీలు
- ఆర్థిక ఇబ్బందుల్లో మధ్యాహ్న వంట ఏజెన్సీలు

పత్తికొండ నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు..

మండలం	స్కూళ్లు	విద్యార్థుల సంఖ్య
పత్తికొండ	46	8,600
తుగ్గలి	66	7,127
మద్దికెర	26	3,038
కృష్ణగిరి	47	6,581
వెల్దుర్తి	61	8,492

ప్రస్తుతం రూ.5కు టీ కూడా అమ్మడం లేదు. అలాంటిది ఒక విద్యార్థికి రూ.5.88కి భోజనం వండి వడ్డించాలంటే సాధ్యమేనా అని మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలు ప్రశ్నిస్తున్నాయి. నేడు అన్ని రకాల సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. నాడు నిర్ణయించిన ధరలతో పోల్చుకుంటే మూడింతలయ్యాయి. అయినా నాటి మెనూ ధరలనే చెల్లిస్తూ నాణ్యమైన, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వండిపెట్టాలంటే ఎలా సాధ్యమంటున్నారు. ఇక నెలవారి బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడం తమకు వంట చేయడం సవాలుతో కూడుకున్నదేనంటున్నారు.


పెండేకల్లు ఆర్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

తుగ్గలి : విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసరాల ధరల పెరుగుదల మంట పుట్టిస్తోంది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోగా, నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా ఇవ్వడం లేదు. పథకం పేరు మార్చిందే తప్ప మెనూ చార్జీలు పెంచలేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోందనే విమర్శలున్నాయి. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నా రుచిలో తేడాలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ధరల ప్రభావం అటు సామాన్య, మధ్య తరగతి ప్రజలతో పాటు పాఠశాలల్లో అమవుతున్న మధ్యాహ్న భోజనంపై కూడా పడుతోంది.

గతంలో మార్పులు..

గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు మార్పులు చేస్తుండేది. దీంతో వంట ఏజెన్సీలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదు. పథకం పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ మిగిలిన వాటిపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తోంది. దీంతో వంట ఏజెన్సీలపై ఆర్థిక భారం పడుతోంది.

పెరిగిన ధరలు..పాత చార్జీలు..

ప్రస్తుతం నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. వంటనూనెలు లీటరుకు రూ.30 వరకు పెరిగాయి. కందిపప్పు రూ.160కు చేరింది. ఎల్లిపాయలు కిలో రూ.400పైనే పలుకుతున్నాయి. పల్లీలు కిలో రూ.120, పెసలు రూ.130కి చేరాయి. ఇలా ఆహార పదార్థాల్లో వినియోగించే అన్ని సరుకుల ధరలు భారీగా పెరిగాయి. ఇక కూరగాయల ధరలు చెప్పనవసరం లేదు. ఏ కూరగాయ కొనాలన్నా రూ.60పైనే. ఖర్చులు రెట్టింపు అయినా మెనూ ధర మాత్రం ఏళ్లుగా మార్చకుండా పాత చార్జీలనే అమలు చేస్తోంది. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థికి రూ.5.88, 6 నుంచి 10వ తరగతి వరకు రూ.8.57 ఇస్తోంది.

రేట్లు పెరిగిపోయాయి



సరుకులు, కూరగాయల ధరలన్నీ భారీగా పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే ధరలతో మధ్యాహ్న భోజనం వండడం భారంగా మారింది. బిల్లులు కూడా సక్రమంగా రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం. పెరిగిన రేట్లకు అనుగుణంగా బిల్లులు సకాలంలో అందిస్తే బాగుంటుంది.

– రామలక్ష్మి, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, పగిడిరాయి

మెనూ చార్జీలు పెరగలేదు



మధ్యాహ్న భోజన మెనూ చార్జీలు పెంపు సమాచారం ఇంకా రాలేదు. పాత మెనూ చార్జీలే అమలవుతున్నాయి. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీలకు సూచించాం. ధర పెరిగిన మాట వాస్తవమే. మెనూ చార్జీల పెంపు ప్రభుత్వ పరిధిలోది..ఈ అంశంపై అక్కడి నుంచే చర్యలుంటాయి.

– రమావెంకటేశ్వర్లు, ఎంఈవో–2, తుగ్గలి

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


కూర్మనారాయణ స్వామి

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీరంగనాథుడికి కార్తీక పూజలు


రంగనాథస్వామి

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కార్తీక మాసం శనివారం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం బిందెసేవ, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ,ప్రసాదాలు అందజేశారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తూర్పు రాజగోపురం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేయడానికి ధర్మవరం పట్టణానికి చెందిన మామిళ్ల రంగప్ప, సాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రామకృష్ణ రూ.20,116 విరాళం అందజేసినట్లు ఈఓ వీరయ్య శనివారం తెలిపారు. దేవాలయ అభివృద్ధికి భక్తులు సహకారం అందించాలని కోరారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని వైద్యులు రాగిణి శనివారం సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకొని వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. ముందస్తు పరీక్షల వల్ల జాగ్రత్తలు పాటించేందుకు వీలవుతుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, అంజలి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


వెల్దుర్తిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రహదారులపై ఉండే అభాగ్యులకు దాతల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు తెలిపారు. శనివారం ఆయన వెల్దుర్తిలోని వృద్ధులు, నిరుపేదలకు జర్నలిస్టు సంఘం మండల అధ్యక్షులు షేక్ అమీర్‌బాషాతో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు.

29న జాబ్‌మేళా

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఎస్‌పీసీ ట్రెనింగ్ సెంటర్‌లో ఈనెల 29న నిర్వహించే జాబ్ మేళాకు నిరుద్యోగులైన యువతీ యువకులు రిజిస్టర్ చేసుకోవాలని ఎస్‌పీసీ ఇన్‌చార్జ్ ఉలిగన్న, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఈ జాబ్‌మేళాలో రెండు కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొంటారన్నారు. ఇందులో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు స్పాట్‌లోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న బస్‌స్టాప్ నుంచి ఎంపీపీ యూపీ పాఠశాల సమీపంలో వస్తే అక్కడ ఎస్‌పీసీ ట్రైనింగ్ సెంటర్ ఉంటుందని తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణాలు నిలుపుదాం

ఆదోని సెంట్రల్: ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఇచ్చి ప్రాణాలను నిలుపుదామని డా.జగదీష్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ క్రిష్టారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం రక్తదానం చేశారు. వారు మాట్లాడుతూ చాల మంది వారి తినే ఆహారంలో పోషకవిలువలు లేకపోవడంతో రక్తహీనతతో బాధపుడుతున్నారని తెలిపారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు 40 మంది దాక రక్తదానం చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఆదివారం నంద్యాల శాంతిరామ్ వైద్య కళాశాల అధినేత శాంతిరామ్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బలరాంగౌడ్, రమాకాంతరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి పట్టణంతోపాటు ఇతర గ్రామాల ప్రజలు వచ్చి ఉచిత వైద్య సేవలు పొందాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘం లీగల్ అడ్వయిజర్‌గా పవన్‌కుమార్

పత్తికొండ(తుగ్గలి) : ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర లీగల్ అడ్వయిజర్‌గా దారా పవన్ కుమార్, రాజకీయ కమిటీ సభ్యుడిగా జయంతి రవితేజ ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీలో పత్తికొండకు చెందిన ఇద్దరికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. అనంతపురంలో ఆదివారం నిర్వహిస్తున్న నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆర్యవైశ్యులు తరలి రావాలని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీలో సభ్యులుగా ఎన్నికవడంపై స్థానిక సంఘం అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేష్, నాయకులు మధుబాబు హర్షం వ్యక్తం చేశారు.

కేజీబీవీలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని సెంట్రల్: పేద మధ్యతరగతి విద్యార్థినులు కస్తూర్బాగాంధీ విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి స్నేహలత అన్నారు. శనివారం పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థినులను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కస్తూర్బాగాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు అవసరమైన వసతిసదుపాయాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ కోర్సులతో పాటు వృత్తివిద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సుధాకర్, మహిళా ఉపాధ్యాయులు కళ్యాణి, పద్మాబాయి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు త్వరతగతిన పరిష్కారం


హొళగుంద సమీపంలో పొలం వద్ద విచారణ చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హొళగుంద: అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలపై విచారణ చేసి త్వరగా పరిష్కరిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలోని హొళగుంద, సుళువాయి, నాగరకణ్వీ తదితర గ్రామాల్లో పర్యటించి రైతులు తమ పొలాలను నాన్ అగ్రికల్చర్‌గా మార్పు చేసుకోవడానికి పెట్టుకున్న దరఖాస్తులకు సంబంధించి , రీ సర్వే వల్ల తలెత్తిన సమస్యలపై విచారణ చేశారు. దరఖాస్తులో పొందు పరిచిన వివరాల మేరకు పొలాలు, రికార్డులు పరిశీలించి తహసీల్దారు సతీష్‌కుమార్, డివిజనల్ సర్వేయర్ వేణుసూర్యకు పలు సూచనలు చేశారు. అలాగే నాగరకణ్వీలో రీ సర్వే వల్ల తలెత్తిన భూముల హెచ్చుతగ్గుల గురించి విచారించారు. అన్ని రికార్డుల పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం హొళగుంద తహసీల్దారు కార్యలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు, సిబ్బంది పని తీరు తదితర వాటి గురించి ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించక పోవడం, విధుల పట్ల అలసత్వం తదితర వాటిపై వీఆర్‌ఓలు, కార్యలయ సిబ్బందిని మందలించారు. సర్వేయర్ డీటీ ముకుందరావు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు ఉన్నారు.

సారూ..మా ఊరికి రోడ్డు వేయించండి


ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాగరకణ్వీ గ్రామస్తులు

హొళగుంద: దశాబ్దాలు గడుస్తున్నా.. మా ఊరికి తారు రోడ్డు వేయలేదు. సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం.. రోడ్డు వేయించాలని నాగరకణ్వీ గ్రామస్తులు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కోరారు. శనివారం గ్రామానికి వచ్చిన ఆయనను గ్రామపెద్దలు నాగిరెడ్డి, బసవనగౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శేషిరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు కలిసి వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. మార్లమడికి క్రాస్ నుంచి నాగరకణ్వీ అక్కడి నుంచి హొన్నూరు వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, వర్షా కాలంలో నడవడానికి కూడా వీలుకాదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరమైతే గర్భిణులు, బాలింతలు, ఇతర పనులు కోసం వెళ్లే వారి అవస్థలు వర్ణనాతీతమని, ఇటు రోడ్డు లేక అటు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఆటోలు, మోటర్‌సైకిళ్ల పై మండల కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మార్లమడికి క్రాస్ నుంచి నాగరకణ్వీ, హొన్నూరు, నాగరకణ్వీ–హొన్నూరు కొట్టాల రోడ్లను బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైకోర్టు ఏర్పాటు చేయకుండా అన్యాయం

పత్తికొండ(తుగ్గలి) : కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సీనియర్ న్యాయవాది, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ..శ్రీ బాగ్ ఒడంబడిక ప్రకారం కోస్తాలో రాజధాని ఉంటే, రాయలసీమలో హైకోర్టు ఉండాలన్నారు. గతంలో కర్నూలులో ఉన్న రాజధానిని వేరే ప్రాంతానికి తరలించి అన్యాయం చేశారన్నారు. ఇప్పుడు సీమ ప్రజల హక్కులను తుంగలో తొక్కి హైకోర్టు ఏర్పాటు చేయాల్సిన చోట బెంచ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి కొందరు వత్తాసు పలకడం ప్రజల మనోభావాలను దెబ్బ తీయడమే అవుతుందన్నారు. బెంచ్ ఏర్పాటు అంటే పప్పులు పెట్టి పోరు మాన్పించడమే అవుతుందని ఎద్దేవా చేశారు. రాజకీయ ఎత్తుగడలో భాగంగానే సీఎం బెంచ్ ఏర్పాటు పాట పాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

హైకోర్టు రాయలసీమ వాసుల హక్కు అని, ఎవరో ఇస్తే తీసుకునేది కాదని పోరాడి సాధించుకోవాలన్నారు. హైకోర్టు ఏర్పాటు కోసం ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమాయాత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్

దేవనకొండ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎం.నరసారావు, రైతు సంఘం నాయకులు శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్‌ల వల్ల కనీస వేతనం, ఉద్యోగభద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పనిదినం హక్కులు వంటి హామీలను రద్దు కాబోతున్నాయన్నారు. ప్రభుత్వ రంగంలో ఎఫ్‌సీఐ సెంట్రల్ వేర్ హౌస్ కార్పొరేషన్ మార్కెట్ యార్డులను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అద్దెకివ్వడం సరికాదన్నారు. నాగేష్, పాండు, నాగరాజు, యూసుఫ్, బాషా, బలరాముడు, బడేసాహెబ్ పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి


ఎరుకలచెరువులోని ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం


ఆస్పరిలో ఓటరు జాబితాను పరిశీలించిన ఆలూరు ఈఆర్ఓ నాగప్రసన్నలక్ష్మి

కృష్ణగిరి: ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని బీఎల్‌ఓలను ఆర్డీఓ భరత్‌నాయక్ ఆదేశించారు. ఓటు నమోదు, తొలగింపు, వివరాల మార్పునకు దరఖాస్తులను స్వీకరించేందుకు శనివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపులను పరిశీలించారు. ఎరుకలచెరుడు, కంబాలపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలు (175, 176, 187, 188, 189, 190) తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు సవరణ దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రత్యేక క్యాంపు నిర్వహణ బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా ఓటర్ నమోదుకు 18, తొలగింపునకు–1, మార్పులకు 7 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎరుకలచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.

ఓటరు నమోదు పక్కాగా నిర్వహించాలి

మద్దికెర : ఓటరు నమోదు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిచాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ అన్నారు. శనివారం మండల కేంద్రం మద్దికెరలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, జొహరాపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆలూరు ఈఆర్ఓ నాగప్రసన్నలక్ష్మి తనిఖీ చేశారు. శనివారం మండలంలోని 65పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆస్పరి, జొహరాపురం పోలింగ్ కేంద్రాల్లో ఈఆర్ఓ ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులున్నా సరిచేసుకునేందకు దరఖాస్తులు ఇవ్వవచ్చన్నారు. మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఆస్పరి తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఉన్నారు.

ఆలూరు: మార్పులు, చేర్పుల కోసం వచ్చే ఓటర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణలో బీఎల్‌ఓలు నిర్లక్ష్యం చేయవద్దని ఆలూరు తహసీల్దార్ గోవింద్‌సింగ్ సూచించారు. స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాల, జెడ్పీ బాలుర – 2 హైస్కూల్లోని ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. ఆర్ఐ బసన్నగౌడు, సిబ్బంది ఉన్నారు.

తుగ్గలి : అర్హులందరూ ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శనివారం స్థానిక పోలింగ్ బూత్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా కొత్త ఓటు నమోదుకు 102 దరఖాస్తులు, తొలగింపునకు 19, సవరణలకు 45 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం


ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అగ్రహార ఆంజనేయస్వామి

హొళగుంద: మండల కేంద్రం సమీపంలో వెలసిన అగ్రహార ఆంజనేయస్వామికి శనివారం కార్తీక మాసం పురస్కరించుకుని అగ్రహార ఆంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ఆకారాల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతభిషేకం, ఆకుపూజ, మహా మంగళారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలు చేపట్టారు. రాత్రి అన్నదానం, భజన కార్యక్రమాలు జరిగాయి.

ట్రాప్ కెమెరాల ఏర్పాటు

కోసిగి: మండల కేంద్రం సమీపంలోని కొండల్లో చిరుతల జాడ పసిగట్టేందుకు సీసీ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు డాగ్‌స్క్వాడ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్ఎస్ పీరా, తుంగభద్ర బీట్ ఆఫీసర్ అనురాధ తెలిపారు. శనివారం జిల్లా ఫారెస్ట్ అధికారుల ఆదేశాల మేరకు కోసిగిలోని తిమ్మప్ప కొండ, బసవన్న కొండ పరిసర ప్రాంతాల్లో సీసీ ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. చిరుతలు తిరుగుతున్న ప్రాంతాలను బట్టి వాటిని అదుపులో తీసుకునేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. అలాగే కొండ చుట్టు పక్కల పొలాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోసిగిలోని ఎల్లెల్సీ కార్యాలయం సమీపంలోని సత్యమ్మవ్వ దేవాలయం సమీపంలో సీసీ ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేశామని, ఆ ప్రాంతాలలో బట్టలు ఉతకడం, స్నానాలు చేయడం చేయరాదని ప్రజలకు సూచించారు. ఇందులో ఫారెస్ట్ సిబ్బంది బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

మహిళల రక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఎస్ఐ దిలీప్ కుమార్

ఆలూరు రూరల్: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, వారి రక్షణ మనందరి బాధ్యత అని ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్,ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికల పాఠశాల ఆవరణలో డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో మహిళల రక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ..మద్యం మత్తులో వికృత చేష్టలకు పాల్పడుతున్న మృగాలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రధానంగా యువతపై సెల్ ఫోన్ ప్రభావం ఎక్కువైందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న తనంలో పెళ్లిళ్లు చేసుకుని అనారోగ్యాల బారిన పడవద్దని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయుడు గిరయ్య, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పద్మ, మండల అధ్యక్షురాలు శేఖన్‌బీ, న్యాయవాది షాకీర్ ఉన్నారు.

వంతెనకు మరమ్మతులు చేపట్టండి

హొళగుంద: స్థానిక ఈబీసీ కాలనీ పక్కన తుంగభద్ర దిగువ కాలువపై ఏర్పాటు చేసిన ఫుట్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. శనివారం ఫుట్‌బ్రిడ్జ్ రంధ్రాల్లో కాలు ఇరుక్కుని గాయపడిన సిద్ధప్పతో కలిసి ఎస్‌డీపీఐ నాయకులు రహంతుల్లా, ఆరీఫ్, సలాం, అబ్రార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ వంతెనపై పెద్ద పెద్ద రంధ్రాలు పడి, రేకులు కోసుకుపోవడంతో ప్రజలు గాయపడుతున్నారని చెప్పారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఫుట్ బ్రిడ్జ్‌పై ఏర్పడిన రంధ్రాల్లో పడి గాయపడిన సిద్ధప్ప →



26న మండల సర్వసభ్య సమావేశం

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 26వ తేదీన ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత శనివారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్యాం కుమార్ హాజరుకానున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు. అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావలన్నారు.